క్లుప్తంగా

అవయవదానంతో అమరత్వం



బాపట్ల: అవయవదానంతో అమరత్వం పొంద వచ్చని బాపట్ల ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.సిద్ధార్థ సూచించారు. అవయవదానం కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా డాక్టర్ సిద్ధార్థ మాట్లాడుతూ అవయవదానంతో మనుషులు చిరంజీవులుగా మారవచ్చు తెలిపారు. ఎందరో జీవితాలలో వెలుగులు నింప వచ్చని చెప్పారు. అవయవదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.మరణం తర్వాత, శరీరదానం వైద్య రంగ పరిశోధనలకు, కొత్త ఆవిష్కరణలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సునీల్‌కుమార్



రేపల్లె రూరల్: రేపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎస్.సునీల్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ డిపోలో డీపీటీఓగా పనిచేస్తూ రేపల్లె డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. తెనాలి డిపోమేనేజర్ రాజశేఖర్ ఇప్పటి వరకు రేపల్లె డిపో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా స్థానిక డిపో కార్యాలయంలో డీఎంకు డిపో అధికారులు, సిబ్బంది, కార్మిక సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



రేపల్లె రూరల్: పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూలులో యాన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు, వ్యాయామం తప్పనిసరి అని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలురకాల వ్యాయామ విన్యాసాలను ప్రదర్శించారు. విద్యార్థులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు.

స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కర్లపాలెం: పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ చెప్పారు. శనివారం సీఐ హరికృష్ణ కర్లపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించటంతో పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ రవికృష్ణతో కలసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ఫిర్యాదులు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదగా మసలుకోవాలని చెప్పారు.

హైవే డేంజర్ స్పాట్లు

- జాతీయ రహదారిపై పెరిగిన ప్రమాదాలు
- ప్రధాన సెంటర్లలో ట్రాఫిక్ అస్తవ్యస్తం
- ప్రమాద సూచికలు లేవు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



పెట్రోల్ బంకులకు పొలాలకు వెళ్లే కోటి సెంటర్ జంక్షన్

చెరుకుపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదాలు భయపెడుతున్నాయి. ట్రాఫిక్ నిర్వహణ అస్తవ్యస్తం ఉంది. ప్రమాద సూచికలు కనిపించడం లేదు. డివైడర్ ఉన్నా స్థానికులు పట్టించుకోవడం లేదు. హైవేపై భారీ వాహనాల రాకపోకలు గమనించడంలో ఏమరపాటుకు గురవుతున్నారు. ఇక్కడ ప్రజలు హైవే విధానానికి అలవాటు పడకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రతిరోజు ప్రమాదాలు నమోదు అవుతున్నాయి.

ఎక్కడెక్కడ ప్రమాదాలంటే..

చెరుకుపల్లిలోని ఖాదర్‌ఖాన్ సెంటర్, గుళ్లపల్లి జంక్షన్ నగరం వెళ్లే రోడ్డు మార్గంలోని ప్రధాన జంక్షన్ జాతీయ రహదారి ప్రారంభం అయిన నాటి నుంచి తరుచూ బైక్, పాదచారులు ఎక్కడో ఒక చోట ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. గ్రామాల్లోని ఈ రోడ్ల నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే క్రమంలో ఇరువైపుల నుంచి వాహనాలు వస్తుంటే అవి దగ్గరకు వచ్చేంత వరకు గుర్తించలేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కొంతమంది వాహనదారులు కనీసం హారన్ కూడా కొట్టడం లేదు అని ద్విచక్రవాహన దారులు, పాదచారులు వాపోతున్నారు.

ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రమాదం...

గుళ్లపల్లి కోటి సెంటర్ నుంచి రైతులు పొలాలకు వెళ్లాలన్నా, వాహనదారులు రెండు పెట్రోల్ బంక్‌లకు వెళ్లాలన్నా అక్కడే ప్రధాన జంక్షన్. గుళ్లపల్లి, పొన్నపల్లి రైతులు కూడా పొలాలకు నగరం రోడ్డు ఎదురు డొంక మార్గం సమీపంలో రోడ్డు దాటాల్సి ఉంది. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చే భారీ వాహనాల తాకిడికి పాదచారులు ద్విచక్రవాహన దారులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయ సీజన్ కావటంతో నగరం అడ్డరోడ్డు ఎదురుగా ఉన్న డొంక నుండి రైతులు ట్రాక్టర్లు ద్వారా గాని, ఎడ్ల బండ్ల ద్వారా గాని ధాన్యం తరలిస్తుంటారు. అయితే ఈ డొంక రోడ్డు ఎక్కే క్రమంలో ఎత్తుగా ర్యాంపు ఉండటం వల్ల ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఫోర్సుగా ఎక్కాలి. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేగంగా వచ్చే వాహనాల తాకిడికి రైతులు భయాందోళన చెందుతున్నారు.

పట్టణానికి ఇరువైపులా..

216ఎ జాతీయ రహదారి చెరుకుపల్లి పట్టణం నడిబొడ్డు నుంచి వెళ్తోంది. ఈ మండల కేంద్రానికి ప్రతిరోజు వేలాది మంది వివిధ పనులపై వచ్చివెళ్తుంటారు. రైతువారీ నేపథ్యం ఉన్న ప్రాంతం. విద్య, వైద్య, వ్యాపార రంగాల్లోనూ అభివృద్ధి చెందుతున్న పట్టణం. చెరుకుపల్లి నుంచి అటు జిల్లా కేంద్రం బాపట్లకు ఇటు భట్టిప్రోలు వైపునకు నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

ప్రమాద హెచ్చరిక సూచికలు లేక..

జాతీయ రహదారిపై ముఖ్యంగా జంక్షన్‌ల వద్ద ఇరువైపులా ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయలేదు. ప్రమాదాలు జరిగే కూడళ్లలో వేగ నియంత్రణ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయలేదు. జాతీయ రహదారికి ఇరువైపులు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు.



హైవే నుంచి నగరం వెళ్లే ప్రధాన జంక్షన్

పోలీసుల చర్యలేవీ..

ట్రాఫిక్ విషయంలో పోలీసులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు హైవే ప్రమాదాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతోందని నిపుణులు చెబుతున్నారు. ఆ మేరకు పోలీసులు చర్యలు తీసుకుంటే కొంత మేర ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై జంక్షన్‌ల వద్ద వాహనాల వేగం తగ్గించేందుకు ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటుచేసి ఇటువంటి ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో కనీసం రబ్బరు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఒక కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి

–డి.ప్రసంగి, కావూరు

నులిపురుగుల నివారణకు చర్యలు

నిజాంపట్నం: ఆల్బెండజోల్ మాత్రలతో మనిషిలో నులిపురుగుల వ్యాప్తిని అరికట్ట వచ్చని కూచినపూడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళీ అన్నారు. ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశాలు, ఏఎన్‌ఎంలకు, పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కూచినపూడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఆల్బెండోజోల్ మాత్రలను అందజేశారు.

నగరంలో..

నగరం: నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు డాక్టర్ నజీలాపర్వీన్ చెప్పారు. మండలంలోని ధూళిపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ, పాఠశాలలు, కాలేజీలలో మాత్రలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డాక్టర్ జాన్‌ప్రసాద్, సీహెచ్‌ఓ బాబూరావు, సూపర్‌వైజర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక జలార్తమ్మ ఎస్టీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజల్లో సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జె.హేమశంకరరావు, సనకా శ్రీనివాసరావు, అర్చకులు కట్టా మహేష్, కోటేశ్వరరావు, జంగం శ్యాంప్రసాద్, శౌంతి బాబురావు పాల్గొన్నారు. భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం చేశారు.

పట్టణ ప్రజలకు తాగునీరు అందితే ఒట్టు

- ఇప్పటికి నగం కాలనీలకు సరఫరా లేదు..
- పట్టనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు

బాపట్ల: పట్టణంలో అన్నీ ప్రాంతాలకు మున్సిపల్ నీటి సరఫరా కలగానే మారింది. పైపులైన్లు, ఫిల్టర్‌బెడ్ పనులు ప్రజారోగ్యశాఖ చేపట్టడం, వాటి నిర్వహణ బాధ్యత మాత్రమే మున్సిపాల్టీ అప్పగించటంతో ఆ రెండు శాఖలు నీటి పంపింగ్‌లో జోన్ల పద్ధతికి మొదటి నుంచి మంగళంపాడారు. నీటి సరఫరాలో జోన్ల పద్ధతి లేకపోతే సజావుగా నీటి సరఫరా జరగకపోగా శివారు ప్రాంతాల్లో కనీసం చుక్క నీరు కూడా జరగకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.

పట్టణంలోని కనీసం నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులకు కలిపి ఆరు జోన్లుగా విభజించి నీటి సరఫరా చేస్తే సజావుగా నీటి సరఫరా జరుగుతుందని మున్సిపల్ అధికారులు మొదటి నుంచి ప్రతిపాదనలు పంపినప్పటికి అప్పట్లో ప్రజారోగ్యశాఖ అధికారులు పట్టించుకోలేదు.



ఓటర్‌హెడ్ ట్యాంకు నుంచి పైపులైన్లు ద్వారా వెళ్లే నీటిని కంట్రోలు చేసేందుకు బిగించిన వాల్వ్

రూ.15 కోట్లతో నీటి పథకం.. అయినా..

రూ.15 కోట్లతో కొత్త ఫిల్టర్‌బెడ్, పైపులైన్లు ఏర్పాటు చేసినా పుర ప్రజలందరికీ నీటి సరఫరా చేయడంలో విఫలమవుతున్నారు. బాపట్ల పట్టణ విస్తీర్ణం 18.5 కిలో మీటర్లు ఉండగా 7,600 కుళాయిలు ఉన్నాయి. ఉన్న కుళాయిలో రెండు వేల కుళాయిలకుపై సజావుగా నీరు రాకపోవటంతో నిరూపయోగంగా కుళాయిలు ఉండిపోయాయి. అన్ని ప్రాంతాలకు ఒక్కసారిగా నీరు వదలటంతో పైపులైన్లుకు చివర ప్రాంతానికి సంబంధించిన పైపులైన్లుకు నీరు చేరే సమయానికి నీటి సరఫరా నిలిచిపోతోంది. పైపులైన్లు మొదట్లో ఉన్న ప్రాంతానికి మాత్రం నీరు సంవృద్ధిగా రావటంతో ఆయా ప్రాంతాలకు చెందిన కొందరు నీటి వృథాకు పాల్పడుతున్నారు.

జోన్ల పద్ధతి మంచిది

ఉప్పరపాలెం వద్ద ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేసిన వెంటనే జోన్ల పద్ధతిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నీటి సరఫరా సజావుగా జరగని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం.

–జి.రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్

నీటి సరఫరా జరగని కాలనీలు ఇవే

పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ, శారదపురికాలనీ, దేవుడుచెరువు, మున్నంవారిపాలెం, శ్రీనివాసకాలనీ, ప్యాడిషన్‌పేట, యాదవపాలెం, మున్నంవారిపాలెం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఘనంగా పొన్నపల్లి జయంతి

చెరుకుపల్లి: పొన్నపల్లి వెంకట సుబ్రహ్మణ్యందత్తు గుళ్లపల్లి గ్రామానికి చేసిన కృషి మరువలేనిదని ఎంఈఓ పులి లాజర్ అన్నారు. శనివారం సుబ్రహ్మణ్యందత్తు 89వ జయంతి వేడుకలు గుళ్లపల్లిలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రేపల్లె మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ ఉల్లంగుంట శ్రీరాంమూర్తి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం దత్తు గ్రామానికి విద్యా, వైద్యం, ముఖ్యంగా గ్రామానికి విద్యుత్ సౌకర్యం రావటానికి ఆయన చేసిన కృషి అభిమానందనీయం అని చెప్పారు. కార్యక్రమంలో నాన్నగారు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నపల్లి సత్యనారాయణ, ఉల్లంగుంట సాంబశివరావు, ఓగిరాల వీరాస్వామి, ఉల్లంగుంట శివరామకృష్ణా, కొండసీమ ప్రభుదాస్ పద్మారావు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యందత్తు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఈఓ, గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బాపట్ల: స్థానిక ఏవీవీ ఉన్నత పాఠశాలలో 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 34 సంవత్సరాల తర్వాత వారంతా ఒకచోట చేరి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనందంగా గత స్మృతులను గుర్తుచేసుకొని పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థి అబ్దుల్ కరీం, రిటైర్డ్ ఉపాధ్యాయిని ఉమా సుందరి లక్ష్యాలను వివరించారు. నేటి విద్యార్థులలో ఆ క్రమశిక్షణ లోపించిందన్నారు. అందరూ సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ప్రతి ఏడాదికోసారి కలుసుకోవాలని నిర్ణయించారు.



రోడ్డే పార్కింగ్ స్థలం!

పట్టణం పరిధిలోని జీబీసీ రహదారిపై భారీ వాహనాలను ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సర్వీసు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసి ఉంచుతున్నారు. ముఖ్యమంగా పట్టణంలోని గోడౌన్లు వద్ద 50 వాహనాలకుపైగా గంటల తరబడి నిలిచిపోతున్నాయి. అంతర్గత రోడ్లును ఉపయోగించుకోవటంలో మున్సిపల్, పోలీసు యంత్రాంగం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

–బాపట్ల

గుర్తు తెలియని వృద్ధురాలికి గాయాలు

చేబ్రోలు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఆమె తల పైభాగం, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఐదుగురికి గాయాలు

చేబ్రోలు: బైకులు ఢీకొని ఐదుగురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో శనివారం జరిగింది. గుంటూరుకు చెందిన భార్యాభర్తలు భరత్ కుమార్, జగదీశ్వరమ్మలు ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై తెనాలి వైపు వెళుతున్నారు. ఈ సమయంలో మండల పరిధిలోని శేకూరుకు చెందిన సాయి రమేష్ బైక్‌పై అజాగ్రత్తగా వెళుతూ ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో గాయపడిన ఐదుగురిని 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా పంచముఖ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

తొలిరోజున స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరణ



సువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి



స్వామివారిని పెళ్లికుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైఖానస ఆగమప్తంగా శనివారం ఉదయం విశేష పూజలతో ప్రారంభమయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు ఏడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజున పంచముఖ ఆంజనేయ స్వామివారిని, మంగళ వాయిద్యములు వేదమంత్రాల నడుమ పెండ్లి కుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు పెండ్లి కుమారుడిగా భక్తులచే పూజలు అందుకున్నారు. రాత్రి ఏడు గంటలకు విష్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజారోహణ పూజా విధులను ఆలయ వంశపారంపర్య అర్చక స్వామి రొంపిచర్ల శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో అర్చకులు ఆర్‌వీ కిరణ్, రమేష్ నిర్వహించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో, మహిళా మండలి సభ్యులు శ్రీహనుమాన్ చాలీసా, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణను సామూహికంగా చేశారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సీతారాముల కళ్యాణం, రాత్రి ఏడు గంటలకు తిరుచ్చి వాహన సేవ పూజలు జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలిరోజు స్వామిని పెళ్లి కుమారుడిని చేసిన వేడుకలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొన్నూరు మున్సిపాలిటీకి 'పన్ను' పోటు

- సిబ్బంది నిర్లక్ష్యం
- కొరవడిన పర్యవేక్షణ
- సకాలంలో వసూలు కాని పన్నులు
- రూ. కోట్లలో పేరుకున్న ఆస్తి పన్ను బకాయిలు
- కుంటుపడుతున్న అభివృద్ధి పనులు
- పారిశుద్ధ్యానికి నిధుల కొరత
- సిబ్బంది వేతనాలకు ఇబ్బందులు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పుర ప్రజలకు ఉండేవే చిన్న చిన్న సమస్యలు.. వాటిని పరిష్కరించడం కూడా మున్సిపల్ అధికారులకు పెద్ద పరీక్షగా మారుతోంది. నెలల తరబడి వెలగని వీధి లైట్లు, పారిశుద్ధ్య పనులు, వాహన మరమ్మతులు, పార్కుల ఆధునికీకరణ, మౌలిక వసతులు, తాగునీటి శుద్ధితో పాటు అనేక సమస్యలను పరిష్కరించాలంటే నిధులు లేకుండా పోతున్నాయి. నెలనెలా సిబ్బందికి వేతనాలు ఇవ్వడానికి ఆపసోపాలు పడాల్సి వస్తోంది. డ్రెయిన్లు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాలు పెట్టడానికి తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇక మురుగు సాఫీగా వెళ్లేందుకు, పూడిక తీసేందుకు కూడా కటకటలాడుతున్నారు. అధికారులు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా..ప్రచారం చేసినా పన్ను చెల్లించనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. దీంతో ప్రత్యేక బృందాలతో ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేయడానికి కసరత్తు చేస్తున్నారు.

పన్నులే ప్రధాన ఆదాయ వనరు

పొన్నూరు పుర పాలక సంఘంలో సమస్యల పరిష్కారానికి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. సకాలంలో వసూలైతేనే పట్టణ ప్రగతి సాధ్యమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న నిధులతో పాటు ఇంటి పన్ను చాలా కీలకం. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు నిండా రెండు నెలలు కూడా లేదు.

ఆస్తి పన్ను ఇలా...	
పట్టణ పరిధిలో వార్డులు	31
అసెస్‌మెంట్లు	11,164
ఆస్తి పన్ను డిమాండ్	రూ.5,70,40,910
ఇప్పటి వరకు వసూలు	రూ. 3,48,69,750
బకాయిలు	రూ. 2,21,00,000

నీటి పన్ను ఇలా..	
వాటర్ టాక్స్ డిమాండ్	రూ. 1,27,39,820
ఇప్పటి వరకు వసూలు	రూ. 36,07,649
బకాయిలు	రూ. 91,00,000

జాప్యమిలా..

వంద శాతం పన్ను వసూలు చేయాలనే లక్ష్యం ప్రతి ఏటా ఉంటున్నా.. అనేక కారణాలు పురపాలక ఆదాయానికి గండికొడుతున్నాయి. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం, ఇతరత్రా విధులలో బిజీగా ఉండటం వంటి కారణాలతో జాప్యమవుతోంది. ప్రజలు కూడా చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. ఏటా రూ. కోట్లలోనే పన్ను బకాయిలు నిలిచిపోతున్నాయి. దీంతో పురపాలక ఆదాయానికి గండి పడుతూ, పట్టణ ప్రగతికి అడ్డంకిగా మారుతోంది. ప్రస్తుతం పొన్నూరు మున్సిపల్ అధికారులు చేపడుతున్న చర్యలతో ఈ సారైనా పూర్తిస్థాయిలో పన్ను బకాయిలు వసూళ్ల లక్ష్యానికి చేరుకుంటారో లేదో వేచి చూడాల్సిందే !

ప్రత్యేక ప్రణాళికతో పన్ను వసూలు



మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను బకాయిలు రూ.కోట్లలో ఉండిపోయాయి. పన్ను వసూళ్లకు వివిధ సర్వేలతో ఆటంకాలు ఎదురవుతున్నాయి. అయినా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. వంద శాతం వసూలుకు కృషి చేస్తున్నాం.

– ముప్పాళ్ల రమేష్‌బాబు, కమిషనర్, పొన్నూరు మున్సిపాలిటీ

పరిసరాల పరిశుభ్రత అవసరం

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాలు పరిశీలించి, శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. గాబులను నాలుగు రోజులకొకసారి శుభ్రం చేసుకోవాలన్నారు.